

దేవదాయశాఖలో ఈవోల బదిలీ

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 24: కర్నూలు, నంద్యాల జిల్లాలోని పలు ఆలయాలకు చెందిన ఈవోలను బదిలీ చేస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యానారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. బి. చంద్రశేఖర్ (ఓర్వకల్లు కాల్వబుగ్గ), ఎ. నాగప్రసాద్ (బండి ఆత్మకూరు ఆలయాలు), డీఆర్‌కేఆర్ ప్రసాద్ (యాగంటి ఉమామహేశ్వర ఆలయం), ఈఆర్ వీరయ్య (శ్రీరంగనాథ ఆలయం, పెరవలి), ఎస్ మోహన్, (ఎ. కోడూరు ఆలయాలు), జి.వినోదా(ఆంజనేయ స్వామి ఆలయం, కోటపాడు), జె.జ్యోతి (ప్రాతకోట ఆలయాలు)ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



జిల్లాకు 3 పదవులు

- ధర్మవరం సుబ్బారెడ్డికి సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
- మరో ఇద్దరికి డైరెక్టర్లుగా అవకాశం
- నామినేటెడ్ పోస్టుల తొలి జాబితా విడుదల



మహేశ్



తాతిరెడ్డి

నంద్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో జిల్లాకు ఒక కార్పొరేషన్ చైర్మన్, రెండు డైరెక్టర్ల పదవులు దక్కాయి. అధికార పార్టీ మంగళవారం ప్రకటించిన జాబితాలో డోన్‌కు చెందిన ధర్మవరం సుబ్బారెడ్డికి రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. నంద్యాలకు చెందిన తాతిరెడ్డి తులసిరెడ్డికి ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్, నందికొట్కూరుకు చెందిన బోయ మహేశ్‌నాయుడుకి ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లైస్ డైరెక్టర్‌గా అవకాశం వచ్చింది. ముఖ్యంగా డోన్‌కు చెందిన ధర్మవరం సుబ్బారెడ్డికి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంతో ఆయన వర్గీయులు సంబరాలు చేసుకుంటున్నారు.

భూమా బ్రహ్మానందరెడ్డికి దక్కని చోటు!

2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయిన తర్వాత నంద్యాల నియోజకవర్గంలో భూమా బ్రహ్మానందరెడ్డి పార్టీని ముందుండి నడిపించారు. దాదాపు నాలుగున్నరేళ్లు టీడీపీ కేడర్ జారిపోకుండా ఉండేలా చూసుకున్నారు. అయితే మారిన సమీకరణాల్లో భాగంగా నంద్యాల సీటును మైనారిటీకి కేటాయించటంతో భూమా బ్రహ్మానందరెడ్డి ఎన్నికల బరిలో నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. పార్టీ కోసం పనిచేసి, సమీకరణాల్లో భాగంగా సీట్లను వదులుకున్న వారికి నామినేటెడ్ పదవుల్లో స్థానం కల్పిస్తారన్న చర్చ ముందు నుంచి నడిచింది. దీనికి తోడు చంద్రబాబు వద్ద మంచి పేరు ఉన్న నాయకులకు కూడా ఈ జాబితాలో చోటు దక్కే అవకాశం ఉందన్న ప్రచారం కూడా సాగింది. ఈ లెక్కన నామినేటెడ్ పదవులు మొదటి జాబితాలో భూమా బ్రహ్మానందరెడ్డికి కచ్చితంగా చోటు దక్కుతుందని ఆయన అనుచరులు భావించారు. అయితే అనూహ్యంగా ఆయనకు ప్రస్తుతం ప్రకటించిన జాబితాలో ఏ పదవి దక్కలేదు. అయితే రెండో జాబితాలోనైనా ఆయనకు పదవి దక్కుతుందా? లేక పార్టీ అధిష్ఠానం మొండిచేయి చూపుతుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పార్టీ గెలుపు కోసం కష్టపడిన వారికి అవకాశం

గత వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను తట్టుకుని పార్టీ గెలుపునకు కృషి చేసిన మరో ఇద్దరిని టీడీపీ అధిష్ఠానం గుర్తించి ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్ల పదవులను కట్టబెట్టింది. ఇలా పార్టీ కోసం కష్టపడిన వారి జాబితాలో నంద్యాల పట్టణానికి చెందిన తాతిరెడ్డి తులసిరెడ్డి ముందు వరుసలో ఉంటారు. మొదట వైసీపీలో ఉన్న ఆయన స్థానిక ఎమ్మెల్యే రవిచంద్రారెడ్డి తీరు నచ్చక బయటకు వచ్చేశారు. ఆ తర్వాత టీడీపీలో చేరి నంద్యాల నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేశారు. పార్టీకి ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన అధిష్ఠానం ఎన్నికలకు ముందు టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది. ఈ క్రమంలో నంద్యాలలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గెలుపునకు కృషి చేశారు. ఆయన పనిచేసిన విధానాన్ని మెచ్చిన టీడీపీ అధిష్ఠానం ప్రస్తుత నామినేటెడ్ పదవులు జాబితాలో ఆయనకు ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా చాన్స్ ఇచ్చింది. ఇక నందికొట్కూరు చెందిన బోయ మహేశ్‌కు కూడా పార్టీ సముచిత స్థానం కల్పించింది. తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉన్న మహేశ్ పార్టీకి ఎప్పటి నుంచో సేవలు చేస్తున్నాడు. దాదాపు పదేళ్లుగా నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనటమే కాకుండా, పార్టీని జనాల్లోనికి బలంగా తీసుకువెళ్లాడు. దీంతో ప్రస్తుత నామినేటెడ్ పదవుల జాబితాలో మహేశ్‌కు స్థానం దక్కింది.



ధర్మవరం సుబ్బారెడ్డి

విధేయతకు పట్టం

సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ధర్మవరం సుబ్బారెడ్డి

మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు

డోన్, సెప్టెంబరు 24: నామినేటెడ్ పోస్టుల విషయంలో విధేయత, నిరంతర ప్రజా సంబంధాలే తెలుగుదేశం పార్టీ గీటురాయిగా తీసుకుంది. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల తొలి జాబితాలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డికి సీఎం చంద్రబాబు సముచిత స్థానం కల్పించారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన సుబ్బారెడ్డిని రాష్ట్ర సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపికయ్యారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవులపై ఎంతోమంది నాయకులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. డోన్ నియోజకవర్గంలో ధర్మవరం సుబ్బారెడ్డికి మంచి పట్టు ఉంది. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో డోన్ నియోజకవర్గంలో పార్టీ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు డోన్ నియోజకవర్గ టీడీపీ బాధ్యతలను సుబ్బారెడ్డికి అప్పగించారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మూడేళ్ల పాటు సుబ్బారెడ్డి పని చేశారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచి సుబ్బారెడ్డి టీడీపీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. దీంతో ఎన్నికలకు ఏడాది ముందు డోన్ పర్యటనకు వచ్చిన సమయంలో చంద్రబాబు నాయుడు డోన్ టీడీపీ అభ్యర్థిగా సుబ్బారెడ్డి పేరును ప్రకటించారు. అలాగే ప్యాపిలి పర్యటనలోనూ సుబ్బారెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు. అయితే ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాలతో డోన్ అసెంబ్లీ టికెట్‌ను కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి కేటాయించారు. టీడీపీ అధినేత చంద్రబాబు స్వయంగా జోక్యం చేసుకుని న్యాయం చేస్తానని సుబ్బారెడ్డికి హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పదవి ఎట్టకేలకు సుబ్బారెడ్డిని వరించింది.

అప్పుడే న్యాయం చేస్తానన్న చంద్రబాబు

ఎన్నికల ముందు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకున్నారు. ఎన్నికల ప్రచారంలో డోన్ బహిరంగ సభలో ధర్మవరం సుబ్బారెడ్డికి న్యాయం చేస్తానని ప్రకటించారు. పార్టీ కోసం కష్టపడి పని చేశారని, తప్పనిసరిగా న్యాయం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. అందులో భాగంగానే డోన్ నియోజకవర్గానికి చెందిన ధర్మవరం సుబ్బారెడ్డికి రాష్ట్ర సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపిక చేశారు.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

ధర్మవరం సుబ్బారెడ్డి

ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు తన సేవలను గుర్తించి రాష్ట్ర సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు.వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేస్తా.

సీఎం చంద్రబాబు సహకారంతో రైతుల సంక్షేమానికి కృషి చేస్తా. రాష్ట్ర స్థాయి చైర్మన్‌గా అవకాశం కల్పించిన సీఎంతో పాటు మంత్రులు నారా లోకేశ్, బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరు చరిత రెడ్డి, భూమా అఖిలప్రియ, బుడ్డారాజశేఖర్ రెడ్డి, గిత్తా జయసూర్య, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు మాండ్ర శివానందరెడ్డి, కేఈ ప్రతాప్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌లకు కృతజ్ఞతలు.

టీటీడీ ఆస్తుల దోపిడీపై విచారణ జరపాలి

- లడ్డు కల్తీ విషయంలో దోషులను కఠినంగా శిక్షించాలి
- టీటీడీ చైర్మన్ పదవిని ఆధ్యాత్మిక గురువులకు ఇవ్వాలి
- మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి

నంద్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన ఆస్తుల దోపిడీ, అపవిత్రతపై సీబీఐ విచారణ జరిపించాలని, టీటీడీ లడ్డూ కల్తీపై న్యాయ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని సీనియర్ టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాలలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. బైరెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలోనూ, ఆయన తనయుడు జగన్ పాలనలోనూ టీటీడీ దేవస్థానం అపవిత్రం అయిందని, ఆస్తుల లూటీ జరిగిందని ఆరోపించారు. నాస్తికులు, అన్యమతస్థుల పెత్తనంలో టీటీడీ విలవిలలాడుతోందని అన్నారు. చంద్రబాబు సీఎం అయిన వెంటనే టీటీడీపై దృష్టి పెట్టారన్నారు. హిందువులు పవిత్రంగా భావించే ఏడుకొండల వెంకన్న లడ్డూను కూడా జగన్, ఆయన చుట్టూ ఉండే అన్యమతస్తులు దోపిడీ గ్యాంగ్ లాలూచీ పడి కల్తీకి పాల్పడటం క్షమించరాని నేరమని అన్నారు. జగన్‌తో పాటు భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి ముఠాలుగా ఏర్పడి ప్రత్యక్షంగా, పరోక్షంగా టీటీడీ నిధులను దోపిడి చేశారన్నారు. తిరుమల లడ్డూలో కల్తీ జరగలేదని జగన్ నమ్మితే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలవాలని బైరెడ్డి సవాల్ విసిరారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డా.కాకరవాడ చిన్న వెంకటస్వామి, ఆ పార్టీ నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, మద్దూరు సర్పంచ్ ప్రదీప్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఈఈల బదిలీ

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 24: ఉమ్మడి జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలలో డీఈఈలు, ఏఈఈలను బదిలీ చేస్తూ పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ ఇన్ ఛీఫ్ ఆర్.గోపాలకృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల డీపీహెచ్‌ఈవోలో డీఈఈగా పని చేస్తున్న జి.గంగాధర్, నంద్యాల మున్సిపాలిటీలో పని చేస్తున్న జి.శ్రీనివాసరెడ్డి, ఎమ్మిగనూరులో పని చేస్తున్న జి.మనోహర్‌రెడ్డిని నగర పాలక సంస్థకు బదిలీ చేశారు. నగర పాలకలో పని చేస్తున్న ఆర్.రాజశేఖర్‌ను ఆదోనికి, కె.రవిప్రకాష్‌నాయుడును రాయదుర్గం, బి.గోపాలకృష్ణను ఏపీఎంఎస్ఐడీసీ మంగళగిరికి డిప్యూటేషన్ ప్రాతిపదికన నియమించారు. ఆదోనిలో పని చేస్తున్న బి.రాజునాయక్ ఎమ్మిగనూరుకు, ఒ.నాగభూషణ్‌రెడ్డిని నంద్యాలకు, కుడాలో పని చేస్తున్న ఎం.నాసిర్‌ను నందికొట్కూరుకు, ఇక్కడే పని చేస్తున్న నాయబ్ రసూల్‌ను కుడాకు, గుంతకల్‌లో పని చేస్తున్న సి.రమణమూర్తిని ఆదోని, అనంతపురం ఏపీ టీడ్కోలో పని చేస్తున్న సి.పవన్‌కుమార్‌ను నంద్యాల, డోన్‌లో పని చేస్తున్న వై.రఘు గుత్తికి, ఇక్కడే పని చేస్తున్న డి.రసూల్‌ను గుత్తికి బదిలీ చేశారు. వీరితో పాటు నగర పాలక కార్యాలయంలో పని చేస్తున్న ఏఈఈ బి.దినేష్‌కుమార్‌ను నందికొట్కూరుకు, కె.జనార్దన్‌ను ఆదోనికి, ఆళ్లగడ్డలో పని చేస్తున్న కె.సురేంద్రనాథ్‌ను ప్రొద్దుటూరుకు, ఆదోనిలో పని చేస్తున్న ఎం.కృపాకర్‌ను గూడూరుకు బదిలీ చేశారు.

గుజరాత్ సీఎంతో మంత్రి బీసీ భేటీ



గుజరాత్ సీఎం భూపేంద్రబాయ్ పటేల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె, సెప్టెంబరు 24: గుజరాత్ సీఎం భూపేంద్రబాయ్ పటేల్‌తో ఆంధ్రప్రదేశ్ రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. బీసీ జనార్దన్‌రెడ్డి గుజరాత్ ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. బీసీని గుజరాత్ సీఎం శాలువాతో సత్కరించారు. గుజరాత్ రోడ్ల నిర్మాణంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏపీ అధ్యయన బృందానికి గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, గుజరాత్ రోడ్లు, భవనాల శాఖ ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. పీపీపీ విధానంలో రోడ్ల అభివృద్ధి నిర్మాణంపై రెండురోజుల పాటు మంత్రి బృందం అధ్యయనం చేయడానికి గుజరాత్‌కు వెళ్లింది. మంగళవారం పీపీపీ విధానం అమలు తీరుతెన్నులపై ప్రజెంటేషన్ ద్వారా ఏపీ హై లెవెల్ కమిటీకి గుజరాత్ ఉన్నతాధికారుల వివరించారు. ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఏపీ ఆర్డీసీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి ఈ బృందంలో ఉన్నారు.

గుజరాత్ ఉన్నతాధికారులతో ఏపీ మంత్రి బృందం సమావేశం

గుజరాత్ ఉన్నతాధికారులతో మంత్రి బృందం సమావేశమైంది. పూర్తి స్థాయిలో రహదారుల నిర్మాణంపై అధ్యయనం చేశారు. గుజరాత్ రాష్ట్రంలో పీపీపీ విధానంలో రోడ్లు అభివృద్ధి అమలు తీరు గురించి గుజరాత్ ఉన్నతాధికారులు మంత్రి అధ్యయన బృందానికి వివరించారు. గుజరాత్ రాష్ట్రంలో సుమారు రూ.2 లక్షల కిలో మీటర్లకు పైగా రహదారులు ఉన్నాయని, వీటిలో పీపీపీ విధానం ద్వారా 14 రహదారులకు 1089 కిమీటర్ల రహదారులను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. ఈ విధానం ద్వారా నెలకు రూ.300 కోట్లు మేర టోల్ ఫీజ్‌ల ద్వారా ఆదాయం వచ్చిందని గుజరాత్ అధికారులు ఏపీ బృందానికి వివరించారు. అహ్మదాబాద్, రాజ్‌కోట్ రోడ్డు మార్గాన్ని 2003లో ప్రపంచ బ్యాంకు రుణంతో అభివృద్ధి చేశామని, ప్రపంచ బ్యాంకుకు గడువుకు ముందుగానే ప్రపంచ బ్యాంక్ రుణం చెల్లించినట్లు వారు వెల్లడించారు. గుజరాత్ రాష్ట్రంలో పీపీపీ విధానం ద్వారా రూ.35 వేల కోట్లతో వివిధ ప్రాజెక్టులు చేపడుతున్నట్లు తెలిపారు. 2007లో రహదారులు భవనాలశాఖకు బడ్జెట్ రూ.1100 కోట్లు ఉండగా, 2023 నాటికి రూ.22 వేల కోట్లు కేటాయించినట్లు గుజరాత్ అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. గాంధీనగర్ సిటీ భూ సేకరణ పద్ధతులు, విధి విధానాల గురించి వివరించారు. గిఫ్ట్ సిటీ నిర్మాణం, హైటెక్ ఎగ్జిబిషన్ నిర్వహణ, మహాత్మా మందిర్ నిర్మాణాల గురించి వివరించారు. అనంతరం గుజరాత్ సీఎంతో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఏపీ ప్రతినిధి బృందం గుజరాత్ సీఎంతో ముఖాముఖి మాట్లాడి గుజరాత్ పీపీపీ విధానాన్ని బీసీ ప్రశంసించారు. గుజరాత్ ప్రభుత్వాన్ని బీసీ అభినందించారు.

'యూజ్‌లెస్ ఫెలో.. సస్పెండ్ చేస్తా'

వీఆర్వోపై మండిపడిన ఆత్మకూరు ఆర్డీవో దాసు



బండిఆత్మకూరులో వీఆర్వోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆర్డీవో దాసు

బండిఆత్మకూరు, సెప్టెంబర్ 24: 'యూజ్ లెస్ ఫెలో.. సస్పెండ్ చేస్తా' అంటూ విధుల్లో నిర్లక్ష్యం వహించిన బండి ఆత్మకూరు మండలం కడమలకాల్వ వీఆర్వో వెంకటేశ్వర్లుపై ఆత్మకూరు ఆర్డీఓ దాసు మండిపడ్డారు. బండి ఆత్మకూరు మండలంలోని ఫ్రీ హోల్డ్ భూములపై జేసీ విష్ణుచరణ్ మంగళవారం విచారణ చేశారు. ఈ సందర్భంగా జేసీ అడిగిన వివరాలను అందించటంలో కడమలకాల్వ వీఆర్వో సరైన సమాచారం ఇవ్వడంలో విఫలమయ్యారు. ఆయనతో పాటు పెద్దదేవళాపురం, ఎర్రగుంట్ల వీఆర్వోలు కూడా పూర్తి సమాచారం లేకుండానే సమావేశానికి హాజరయ్యారు. కింది స్థాయి ఉద్యోగులతో సక్రమంగా పనిచేయించకుండా ఏం చేస్తున్నారంటూ ఆర్డీఓ దాసు, తహసీల్దారు ధోని అల్రెడ్, డీటీ హరితపై జేసీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జేసీ సమావేశం ముగిసిన అనంతరం ఆర్డీఓ వీఆర్వోలతో ప్రత్యేకంగా మాట్లాడి వారి తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కడమలకాల్వ వీఆర్వో వ్యవహార శైలి మార్చుకోవాలని, లేకపోతే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మండలంలోని కడమలకాల్వతో పాటు మిగిలిన గ్రామాలైన ఎర్రగుంట్ల, పెద్దదేవళాపురం, ఈర్నపాడు, నారాయణపురం గ్రామాల్లోని ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన ఈ నెల 26 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



శ్రీశైలం, సెప్టెంబరు 24: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి మంగళవారం వరద ప్రవాహం కొనసాగింది. జూరాల నుంచి 60,629 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 4000 క్యూసెక్కులు మొత్తం 65429 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 874.80 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 162.4372 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 29119 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

రాజకీయం నేనే చేస్తానంటే కుదరదు

ఎమ్మెల్యే పార్థసారథిపై బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ సంచలన వ్యాఖ్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాష్ జైన్

ఆదోని, సెప్టెంబరు 24: ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిపై సొంతపార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'రాజకీయం తానే చేస్తానని ఎమ్మెల్యే అంటే కుదరదు..' అంటూ ఆయన అన్నారు. మంగళవారం ఆదోని మండలం నాగలాపురం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన 'మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ప్రకాష్ జైన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదోని ఎమ్మెల్యేగా ప్రజలు పార్థసారథిని ఎన్నుకున్నారంటే అది కేవలం మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, తన వల్లేనని అన్నారు. ఆదోని ప్రజలకు ప్రస్తుత ఎమ్మెల్యే ఎవరో తెలియదని అన్నారు. ఆదోని ప్రజలకు ఏం చేయాలో తమ ఇద్దరికే బాగా తెలుసు అని అన్నారు. ఇక్కడ పరిస్థితులకు అనుగుణంగా రాజకీయం చేస్తూ అభివృద్ధి వైపు నడిపించాలన్నారు. కానీ ఎమ్మెల్యే ఒంటెత్తు పోకడతో ఎవరినో ఒకరిని పట్టుకుని తిరిగితే తాము సహకరించే ప్రసక్తే లేదన్నారు. 43 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఇలా ఎవరూ వ్యవహరించలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవేంద్రప్ప, ఉమాపతి నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి



వాడాల గ్రామంలో టీడీపీ నాయకులతో బైరెడ్డి రాజశేఖరరెడ్డి

పాములపాడు, సెప్టెంబరు 24: రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం పాములపాడు మండలంలోని వాడాల గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని, దోచుకోవడం, దాచుకోవడం తప్ప అభివృద్ధి శూన్యమని అన్నారు. రైతులు మాట్లాడుతూ గత పదేళ్ల క్రితం విస్తరణ పనుల్లో భాగంగా గ్రామ శివారులో తెలుగుగంగపై సూపర్ ప్యాసేజీ బ్రిడ్జిని కూల్చేడంతో దాదాపు 1500 ఎకరాలకు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. విషయాన్ని ఏళ్ల తరబడి నాయకులకు, అధికారులకు విన్నవించినా ఫలితం లేదని రైతులు బైరెడ్డి విన్నవించారు. స్పందించిన బైరెడ్డి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామంలో హిందూ స్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని, తాగునీటి సమస్య ఉన్నందున మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు. సమావేశంలో నాయకులు చిన్న శీలారెడ్డి, ప్రసాదరెడ్డి, లలితమ్మ, భువనేశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి, కురువ రమేష్, బాలీశ్వరరెడ్డి, గాండ్ల ప్రసాద్, రామ్మోహన్, రామిరెడ్డి, మల్లికార్జునయాదవ్, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

ఉర్దూకు అనుమతి ఇవ్వకపోవడం సరి కాదు



సమావేశంలో మాట్లాడుతున్న అబులైస్

నంద్యాల రూరల్, సెప్టెంబరు 24 : సీబీఎస్‌సీ పరీక్షల్లో ఉర్దూ భాషకు అనుమతిని నిరాకరించడం సరైందికాదని, ఇది విద్యాహక్కును కాలరాయడమేనని నంద్యాల ముస్లిం జేఏసీ గౌరవాధ్యక్షుడు ఎస్ఎండి అబులైస్, షేక్ అబ్దుల్‌సమ్మద్ అన్నారు. మంగళవారం జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉర్దూ మీడియం విద్యార్థులు తమ మాతృభాషలో అనుమతి లేకుండా పరీక్షలు రాయకూడదనే సీబీఎస్‌సీ వివక్షా పూరిత నిర్ణయాన్ని నంద్యాల ముస్లిం జేఏసీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. భాషాభేదం లేకుండా విద్యార్థులందరికీ సమాన అవకాశాలుండేలా ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని సీబీఎస్‌సీని, నేషనల్ మైనార్టీ కమిషన్‌ను కోరుతున్నట్లు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జాకీర్, మునీర్‌అహమ్మద్, హర్షద్, జకారియా పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులను తొలగిస్తే సహించం

మిడుతూరు, సెప్టెంబరు 24: 25 సంవత్సరాల నుంచి మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను తొలగిస్తే సహించేది లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కీర్‌సాహేబ్ మండల నాయకుడు ఓబులేసు సీఐటీయూ మండల నాయకుడు వెంకటశివుడు హెచ్చరించారు. మంగళవారం దేవనూరు గ్రామంలోని జిల్లాపరిషత్, మండల పరిషత్ పాఠశాలలో గత 25ఏళ్ల నుంచి మధ్యాహ్న భోజన పథకం కింద వంట చేస్తున్న కార్మికులను టీడీపీ అధికారంలోకి వచ్చాక ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా మిమ్మల్ని తొలగిస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం దేవనూరు గ్రామంలో జరిగిన సంఘటనపై త్రిసభ్య కమిటీకి వినతి ఇచ్చారు. కార్యక్రమంలో బీవైఎస్‌ఐ నాయకులు బాబు, జావీదు కార్మికులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు వీడ్కోలు

శ్రీశైలం, సెప్టెంబరు 24: శ్రీశైలం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ విభాగపు డ్రాఫ్టుమెన్ క్యాడర్లలోని మొత్తం 21 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు దేవస్థానం పరిపాలనా భవనంలో బదిలీపై వెళ్తున్న సిబ్బందికి వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించి సన్మానించారు.

ఇంకెన్నాళ్లు?

- అసంపూర్తిగా హైవే పనులు
- పూర్తి గాని సర్వీసు రోడ్లు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- ప్రమాదాలపై హైవే అధికారుల నిర్లక్ష్యం

పాణ్యం సెప్టెంబరు 24

నాలుగు రోడ్ల విస్తరణ పనులు అసంపూర్తిగా మిగిలాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 2010 నవంబర్ 15 న బీఓటీ (బిల్డ్ ఆర్గనైజింగ్ ట్రాన్స్‌ఫర్) ఒప్పందంతో కేఎంసీ నిర్మాణ సంస్థ చిత్తూరు-కర్నూలు 18 వ నెంబరు జాతీయ రహదారిని నాలుగురోడ్ల విస్తరణ పనులు చేపట్టింది. 2013 మే లోపల పూర్తి చేయాల్సిన పనులు ఇప్పటి వరకు పూర్తి కాలేదు. నిర్మాణం కోసం దాదాపు 700 ఎకరాల్లోని ప్రైవేట్, ప్రభుత్వ, అటవీ భూములు సేకరించారు. సాంకేతిక, ఇతర కారణాలతో పనుల్లో జాప్యం ఏర్పడి 2014 మే వరకు నిర్మాణ గడువు పెంచారు. నిధుల లేమితో రెండేళ్లపాటు పనులు నిలిచి పోయాయి. రోడ్ల నిర్మాణానికి పాణ్యం, కౌలూరు, నెరవాడ, తమ్మరాజుపల్లె గ్రామాల పరిధిలో 174. 09 ఎకరాల ప్రైవేటు, 12. 05 ఎకరాల ప్రభుత్వ భూములు సేకరించింది. పాణ్యం బస్టాండు ప్రాంతంలో 63 గృహ, వాణిజ్య, కార్యాలయాల నిర్మాణాలను తొలగించడంతో హైవేపై జీవిస్తున్న 100 కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి.



పాణ్యం ఫ్లైఓవర్ వద్ద పూర్తి కాని బారికేడ్ల నిర్మాణం

అసంపూర్తిగా రెస్ట్ జోన్ పనులు

పాణ్యం మండలంలోని కొల్లమాకుల చెరువు ఎదురుగా హైవే శాఖ మూడెకరాల అటవీ భూమిని రెస్ట్‌జోన్ కోసం కేటాయించింది. ఈ స్థలంలో ప్రయాణికులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, మెకానిక్ షాపు, పెట్రోల్, డీజల్ పంపు, విశ్రాంతి గదులు, వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. హైవే రోడ్డుపై చెడిపోయి నిలిచిపోయిన వాహనాలను వెంటనే హైవే సిబ్బంది రెస్ట్ జోన్‌కు తరలించాలి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే డ్రైవర్లు వంటలు చేసుకోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి ఈ రెస్ట్‌జోన్ ఎంతో దోహదపడుతుంది. కాగా ఇంత వరకు ఈ స్థలంలో బ్లాస్టింగ్ సనులు తప్ప ఎలాంటి పనులు చేపట్టకపోవడంపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తి నిర్మాణాలతో అవస్థలు

పాణ్యం, నెరవాడ మెట్ట వద్ద పీయూపీ, వీయూపీలలో వర్షాకాలంలో వర్షపు నీరు నిలిచి ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. నెరవాడ మెట్ట ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలవద్ద పీయూపీలో నీరు నిలిచి విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పాణ్యం, తమ్మరాజుపల్లె వద్ద సర్వీసు రోడ్డు అసంపూర్తిగా నిలచి వాహనాల రాకపోకలకు అంతరాయమేర్పడుతుంది. బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్ వద్ద ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు అందుబాటులో లేవు. రహదారి మధ్య చెట్లను ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురుకు ఎదురుగా వెళ్లే వాహనాలు కనపడక నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల బలపనూరు సమీపంలో అతి వేగంతో వెళ్తున్న ప్రైవేటు బస్సుకు ఎదురుగా వెళ్తున్న ఎద్దుల బండి కనపడక ఢీకొనడంతో ఒక వ్యక్తి తోపాటు ఎద్దు మృత్యువాత పడ్డాయి. 2023 ఆగస్టు 3న రహదారిపై నిలిచిన టిప్పర్‌ను ఢీకొని పాణ్యం కు చెందిన క్రీడాకారుడు మృతి చెందాడు. బలపనూరు వద్ద సర్వీసు రోడ్డుపై ధాన్యం ఆరబోయడంతో హైవేపై వెళ్తున్న ఎద్దులబండిని లారీ ఢీకొన్న సంఘటనలో ఒకే కుటుంబంలోని నలుగురు వ్యక్తులు మృతి చెందారు. బస్టాండు కూడలిలో హైవే స్థలం కబ్జాకు గురి కావడంతో రోడ్డు ఇరుకుగా మారి రద్దీ ఏర్పడి వాహనాల రాకపోకలకు అంతరాయమేర్పడుతోంది. ఫ్లై ఓవర్ రోడ్డు ముగిసిన చోట యూటర్న్ ఏర్పాటు చేయకపోవడంతో సర్వీసు రోడ్డు నుంచి వెళ్లే వాహనాలకు ఇబ్బందులేర్పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన డిజైన్ ప్రకారం నిర్మాణం చేపట్టలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి విస్తరణ పనులను పూర్తి చేయాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.



పూర్తి కాని మురుగు కాల్వలు



అసంపూర్తిగా నిలిచిపోయిన రెస్ట్ జోన్ నిర్మాణం



పగిద్యాలలో ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు

రాష్ట్రాభివృద్ధే టీడీపీ ధ్యేయం: ఎమ్మెల్యే

పగిడ్యాల, సెప్టెంబరు 24: రాష్ట్రాభివృద్ధే టీడీపీ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. పగిడ్యాల ఎంపీడీవో కార్యలయం వద్ద మంగళవారం ఇది మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్రం సంక్షోభంలో కూరుకపోయిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజులల్లోని రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబునాయుడు గాడిలో పెట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు మెగా డీఎస్సీ కింద 16, 437 పోస్టుల భర్తీకి నోటిపికేషన్ జారీ, అన్నా క్యాంటీన్ల ప్రారంభం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశామన్నారు. అనంతరం గ్రామంలోని ఇండ్ల వద్దకు వెళ్లి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికించి ప్రభుత్వం పనితీరును ప్రజలకు వివరించారు. ఎంపీడీవో కార్యాలయం సమీపంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీపీ మల్లీశ్వరి, టీడీపీ నియోజకవర్గ నాయకుడు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, నాయకులు దామోదర్ రెడ్డి, వాసురెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లోనే గొప్ప పథకాలు ప్రవేశపెట్టాం

ఆత్మకూరు, సెప్టెంబరు 24: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గొప్ప సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కూటమి ప్రభుత్వానిదని మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, టీడీపీ పట్టణాధ్యక్షులు వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం వంద రోజుల కూటమి పాలన గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 6,7,13 సచివాలయాలకు సంబంధించి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వంద రోజుల పాలనపై గోడపత్రికలను ఆవిష్కరించారు. ఆతర్వాత ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్విరార్‌మెంట్ ఏఈ ఓబులేసు, మేనేజర్ చాంద్‌బాషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జీవన్, స్థానిక టీడీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

జూపాడుబంగ్లా: ప్రజా సంక్షేమమే చంద్రబాబు ధ్యేయమని టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లుయాదవ్ అన్నారు. పరిపాలన 100రోజులు పూర్తి అయిన సందర్భంగా మంగళవారం మండలంలోని తూడిచర్ల గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం అనే ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి వెళ్లి చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించి ఇంటికి స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేణుగోపాల్, కాగులశంకర్, సంపత్, పెద్దస్వామి, జమ్ములయ్య, వెంకటయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కూటమి పాలనతోనే సమగ్రాభివృద్ధి

నంద్యాల రూరల్ : రాష్ట్రంలో కూటమి పాలనతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం నంద్యాలలోని టీడీపీ ఎంపీ కార్యాలయంలో బైరెడ్డి రాజశేఖరరెడ్డి సమక్షంలో వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. పాణ్యం మండలంలోని మద్దూరు, గోనవరం, నెరవాడ, భూపనపాడు గ్రామాల ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ సభ్యుడిగా మహేష్ నాయుడు



నందికొట్కూరు, సెప్టెంబరు 24: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల జాబితాను మంగళవారం విడుదల చేసింది. ఈ జాబితాలో నందికొట్కూరు నియోజకవర్గానికి చెందిన మహేష్ నాయుడును రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ సభ్యుడుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ రాష్ట్ర కమిటీలో చైర్మన్‌తో పాటు 15 మంది సభ్యులు ఉంటారు. తనకు ఈ అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖామంత్రి నారా లోకేశ్‌లకు మహేష్ నాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దీంతో పలువురు నియోజకవర్గంలోని నాయకులు మహేష్ నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించండి



కమిషనర్‌ను కలిసిన నాయకులు

నందికొట్కూరు, సెప్టెంబరు 24: పట్టణంలోని ఏబీఎం పాలెంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆ కాలనీకి చెందిన టీడీపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ బేబీకి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏబీఎం పాలెంకు చెందిన టీడీపీ నాయకులు నిమ్మకాల మోహన్, కళాకర్‌లు నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంబీఎం పాలెంలో నెలకొన్న పారిశుధ్య, డ్రైనేజీ నిర్మాణాలపై కమిషనర్ దృష్టి సారించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, ప్రమోద్, బొగ్గుల శేఖర్, అడివప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంసీకి సీఎం రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలి

నందికొట్కూరు, సెప్టెంబరు 24: ప్రొఫెసర్లు లేని కారణంతో మెడికల్ కాలేజీలను రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీడీఎస్‌యూ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆది మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో కొత్తగా రానున్న 5 మెడికల్ కళాశాలల్లో ప్రొఫెసర్లు లేరని ప్రభుత్వం చెబుతూ నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేఖ రాయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ ఉపాధ్యక్షుడు జగదీష్, అశోక్, ఆది, శివశంకర్, ప్రణీత్ కుమార్, రియాజ్ పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ అందజేత



కంప్యూటర్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థి

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 24: మండలంలోని తూడిచర్ల గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి కాశిబోయిన వెంకట అశోక్‌కుమార్ యాదవ్ కనకయ్య కొట్టాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంగళవారం కంప్యూటర్‌ను అందజేశారు. చదువుకున్న పాఠశాలకు ఏదోఒకటి చేయాలనే తపనతోనే హెడ్మాస్టర్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. విద్యాకమిటీ చైర్మన్‌నూర్‌అమ్మద్, గ్రామ పెద్దలు వెంకటేశ్వర్లుయాదవ్, వేణుగోపాల్, చిన్నసుబ్బయ్య, సురేష్‌యాదవ్, పుల్లన్నయాదవ్ పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

గడివేముల, సెప్టెంబరు 24: మండలంలోని చిందుకూరు గ్రామంలో మంగళవారం పిచ్చికుక్క దాడి చేసిన ఘటనలో ముగ్గురు గాయాలపాలయ్యారు. గ్రామానికి చెందిన తిరుమలేష్, పల్లపు చింటు, వెంకటశివుడుపై కుక్క దాడి చేసి గాయపరిచింది. వారు గడివేముల ఆరోగ్య ఉప కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. గ్రామంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని ప్రజలు వాపోయారు.

పులి కాదు.. అడవి పిల్లి: డీఆర్వో విజయలక్ష్మి

గడివేముల, సెప్టెంబరు 24: మండల కేంద్రం శివార్లలోని పంట పొలాల్లో పులి సంచరిస్తున్నట్లు వదంతులు వచ్చాయని, అయితే అది అడవి పిల్లి అని డీఆర్వో విజయలక్ష్మి స్పష్టం చేశారు. నందికొట్కూరు రస్తాలోని రైస్‌మిల్ సమీపంలో ఉన్న పంట పొలాల్లో పులులు సంచరిస్తున్నాయని స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అటవీశాఖ అధికారి విజయలక్ష్మి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం రాత్రి 10 గంటల నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. పంట పొలాలు, మద్దిలేరు వాగు సమీపంలో క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న పాదముద్రలను సేకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పాదముద్రలు పరిశీలించిన ఉన్నతాధికారులు ఆ పాదముద్రలు పులివి కాదని, అడవి పిల్లివని నిర్ధారించారు. వన్యప్రాణులు గ్రామ శివార్లలో కనపడితే తమ దృష్టికి తీసుకొని రావాలని డీఆర్వో విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారులు అబ్దుల్‌కలామ్, జమాల్‌వలి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

మహానంది, సెప్టెంబరు 24: మహానంది మండలంలో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేలా లబ్ధిదారులను కోరాలని మండల ప్రత్యేకాధికారి మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం మహానంది మండలం ఎం. తిమ్మాపురంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయన హౌసింగ్ సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. మండలంలో 1053 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఇందులో 697 ఇప్పటి వరకు పూర్తయాయని, మిగిలిన 207 ఇళ్లు వివిధ దశాల్లో ఉన్నాయని తెలిపారు. త్వరలోనే నిర్మాణాలను పూర్తి చేసుకొనేలా డోర్ టూ డోర్ తిరిగి లబ్ధిదారులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శివనాగజ్యోతి, హౌసింగ్ ఏఈ వాసుదేవుడు పాల్గొన్నారు.

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో ఆర్జీఎం అధ్యాపకులు




శాస్త్రవేత్తలను అభినందిస్తున్న ఆర్జీఎం చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు

పాణ్యం, సెప్టెంబరు 24 : ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో ఆర్జీఎం అధ్యాపకులు ఎంపికైనట్లు ఆర్జీఎం కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ అమెరికాలోని ప్రముఖ స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ ప్రతి యేటా ప్రపంచంలోని శాస్త్రవేత్తల్లో రెండు శాతం మంది అత్యంత ప్రతిభా శాస్త్రవేత్తలుగా గుర్తిస్తుందన్నారు. ఇందులో భాగంగా స్టాన్‌ఫోర్డ్ మంగళవారం విడుదల చేసిన శాస్త్రవేత్తల జాబితాలో 2023- 24 సంవత్సరానికి గాను ఆర్జీఎం కళాశాలకు చెందిన నలుగురు అధ్యాపకులు గుర్తింపు పొందినట్లు తెలిపారు. మెకానికల్ ఇంజనీరింగ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో డాక్టర్ పి. సుదర్శనరెడ్డి 698వ ర్యాంకు, డాక్టర్ పి. శ్రీదేవి 964వ ర్యాంకులు సాధించారన్నారు. అలాగే డాక్టర్ ఉపేంద్ర రాజాక్ ఎనర్జీ విభాగంలో 1169వ ర్యాంకు, డాక్టర్ బి. జమాలయ్య అప్లైడ్ ఫిజిక్స్ విభాగంలో 5794వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలను ఆర్జీఎం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎం. శాంతిరాముడు, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డీన్ డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ రామిరెడ్డి అభినందించారు.

సమస్యలను పరిష్కరించండి

పగిడ్యాల, సెప్టెంబరు 24: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు ప్రభావతి, లక్ష్మీదేవి, సునీతా, రాములమ్మ, షాజీదాబీ ఎమ్మెల్యే గిత్తా జయసూర్యను కోరారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రంలో బాగంగా పగిడ్యాలకు వచ్చిన ఎమ్మెల్యేను అంగన్‌వాడీ వర్కర్లు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల జీతభత్యాలు పెంచాలని, పనిభారాన్ని తగ్గించాలని ఆయనను కోరారు. అందుకు స్పందించిన ఆయన అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అనంతరం సీడీపీవో కోటేశ్వరమ్మ, ఐసీడిఎస్ సూపర్‌వైజర్ శేషమ్మ ఉన్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి



రైతులకు భూసార పత్రాలను అందజేస్తున్న అధికారులు, నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 24: పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని ఆత్మకూరు ఏడీఏ షాలురెడ్డి, ఆర్ఏఆర్ఎస్ వ్యవసాయ శాస్త్రవేత్తలు అశోక్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వ్యవసాయ వాటి అనుబంధ శాఖల పరిధిలోని రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్న సంకల్పంతో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం భూసార పరీక్షా ఫలితాల పత్రాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, సెరికల్చర్ ఏడీ నగేష్, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారి చందన, పశువైద్యాధికారి వరలక్ష్మి ఉన్నారు.

మిడుతూరు: మండలంలోని అలగనూరు, రోళ్లపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి పీరునాయక్ నిర్వహించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన ప్రిన్సిపాల్ సైంటిస్టు డాక్టర్ రామక్రిష్ణ రావు శనగ పంట లద్దె పురుగుల నివారణ కోసం సమగ్ర సస్యరక్షణ పద్ధతుల గురించి రైతులకు వివరించారు. అనంతరం మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు.

కొత్తపల్లి: రైతులు పంట పొలాల్లో పురుగుల మందుల వాడకం బాగా తగ్గించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి హేమలత సూచించారు. సోమవారం కొత్తపల్లి వ్యవసాయ కార్యాలయంలో ఏవో మహేష్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ లక్ష్మీదేవి, జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడులు హాజరయ్యారు. హేమలత మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు ఆయా గ్రామాలను సందర్శించి రైతులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. అనంతరం క్షేత్ర స్థాయి సందర్శన ద్వారా రైతుల సలహాలు, సూచనలు ఇస్తారని, ప్రతి రైతు అధికారుల సలహాలు పాటించాలని కోరారు. జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయాధికారులు వరదల వల్ల దెబ్బతిన్న పంటలను గుర్తించి రైతులకు నష్టపరిహారం వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం వారు పొలం పిలుస్తుంది వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి భువనేశ్వరి, సెరికల్చర్ అధికారి లింగమూర్తి, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది: మండలంలోని గాజులపల్లి, బసవాపురం గ్రామా ల్లో మండల వ్యవసాయాధికారి బి. నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ఏవో మాట్లాడుతూ రైతులు పంటలు సాగు చేసేటప్పుడు సమగ్ర సస్య రక్షణను పాటించాలని అన్నారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ రామలక్ష్మమ్మ వ్యవసాయ సహాయ సంచాలకులు పల్లవి,షైనీ రైతులు పాల్గొన్నారు.

జడ్పీలో బదిలీల చిచ్చు



- మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులపై భిన్నాభిప్రాయాలు
- చైర్మన్, సీఈవో మధ్య పెరిగిన దూరం

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 24: జిల్లా పరిషత్‌లో బదిలీల చిచ్చు రగిలింది. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సీఈవో జి.నాసరరెడ్డి మధ్య దూరం పెరిగినట్లు తెలుస్తోంది. ప్రధానంగా జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న ఎంపీడీవోలు-42 మంది, పరిపాలన అధికారులు-22 వివిధ విభాగాలు, పాఠశాలల్లో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు 33, జూనియర్ అసిస్టెంట్లు-45, టైపిస్టులు-12, రికార్డు అసిస్టెంట్లు-27 ల్యాబ్ అసిస్టెంట్లు-11, లైబ్రరీ అసిస్టెంట్లు-12, నాల్గవ తరగతి ఉద్యోగులు-5 మందికి సంబంధించి బదిలీల ప్రక్రియ నిర్వహించాలి. ఈ క్రమంలో ఒక్క ఎంపీడీవోల బదిలీలు తప్ప మిగిలినవన్నీ సజావుగా నిర్వహించారు.

నోట్ అప్రూవల్ లేకుండా జాబితా విడుదల

చైర్మన్ నోట్ అప్రూవల్ లేకుండా సీఈవో ఎంపీడీవోల జాబితాలు ఎలా విడుదల చేస్తారని చైర్మన్ అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసుల ప్రకారమే తాను జాబితాలు విడుదల చేసినట్లు సీఈవో వివరించారు. ఈ క్రమంలో ఎవ్వరికి వారే యమునా తీరంగా జాబితాలు విడుదల చేశారు. ఇప్పటికే ఈ జాబితాలు సంబంధిత శాఖ ఉద్యోగుల వాట్సాప్ గ్రూపులలో చక్కర్లు కొడుతున్నాయి. ప్రధానంగా బనగానపల్లె నియోజకవర్గంలోని మండలాలకు సంబంధించి చైర్మన్ తాను అనుకున్న వారికే పోస్టింగ్‌లు ఇవ్వాలని పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి కూడా తాను సూచించిన వారికే ఇవ్వాలని లేఖలు ఇచ్చినట్లు తెలిసింది. ఇద్దరి మధ్య గతంలో నుంచే వైరం ఉండటంతో మధ్యలో అధికారులు సతమతమవుతున్నారు.

మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులపై భిన్నాభిప్రాయాలు

ఎంపీడీవోల విషయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు నుంచి వచ్చిన సిఫారసులపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా ఈ నెల 22 లోపల బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈక్రమంలో ఆదివారం రాత్రికే బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. అయితే ఎంపీడీవోల బదిలీల విషయంలో వివిధ రకాల సమస్యలను చైర్మన్, సీఈవో ఎదుర్కొన్నారు. ముఖ్యంగా కొందరు ఎమ్మెల్యేలు, మంత్రుల నుంచి వచ్చిన సిఫారసులను చైర్మన్ బుట్టదాఖలు చేసి తనకు నచ్చిన వారిని నియమించారని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే మంత్రులు, ఎమ్మెల్యే సిఫారసులను తప్పకుండా పాటించాలని సీఈవో పట్టుబట్టారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య బేధాభిప్రాయాలు వచ్చాయి. ఈ క్రమంలో ఎంపీడీలకు సంబంధించి చైర్మన్ ఒక జాబితాను విడుదల చేశారు. చైర్మన్ విడుదల చేసిన జాబితాలో సీఈవో 9 మంది ఎండీవోల పేర్లు మార్చి ప్రొసీడింగ్స్ సిద్ధం చేశారు. దీంతో పాటు చైర్మన్ జాబితాలో ఎంపీడీవోల సంఖ్య 40 ఉంటే సీఈవో విడుదల చేసిన జాబితాలో 42కి వచ్చింది. దీంతో ఇద్దరి మధ్య అగాథం పెరిగింది.



అప్పు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య

గోనెగండ్ల, సెప్టెంబరు 24: ఇల్లు కట్టుకోడానికి రూ. 8 లక్షలు అప్పుచేసి, తీర్చలేక తీవ్ర మానసిక వ్యథకు గురైన బోయ సీతారాముడు(32) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని పెద్దమరివీడు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. నందవరం మండలం కనకవీడు పేట గ్రామానికి చెందిన బోయ సీతారాముడుకు ఆరేళ్ల క్రితం పెద్దమరివీడు గ్రామానికి చెందిన మునీంద్రమ్మతో పెళ్లి జరిగింది. వీరి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇరువురు కూలీ పని చేసి జీవనం సాగించేవారు. వీరు రూ. 8 లక్షలు అప్పుచేసి కనవీడు పేటలో ఇల్లు కట్టుకున్నారు. ఈ అప్పును ఎలా తీర్చాలో తెలియక సీతారాముడు పార్లపల్లి రస్తాలో ఇషాక్ పొలం దగ్గర తుమ్మ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి లచ్చప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

టపాసుల విక్రయ లైసెన్స్‌కు దరఖాస్తుల స్వీకరణ

కర్నూలు(రూరల్)సెప్టెంబరు24: దీపావళి పండుగను పురస్కరించుకొని టపాసుల విక్రయానికి తాత్కాలిక లైసెన్స్‌లు పొందడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తలైసెన్స్ ఫారం ఎల్ఈ-5 కోసం తహసీల్దార్ ద్వారా ఫారం ఏఈ-5లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన స్టాల్స్ నిర్వాహకులకు సూచించారు. గతేడాది ఎల్ఈ-5 లైసెన్స్‌లు పొందిన వారు తదుపరి రెన్యువల్ కోసం ఆర్ఈ-1లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు అంతర్జాతీయ అవార్డు



కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 24: కర్నూలుకు చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు సౌత్ అమెరికాకు చెందిన ఈక్వెడార్ దేశం నుంచి మంగళవారం ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ అండ్ పీస్ జస్టిస్ అంతర్జాతీయ సంస్థ నుంచి అవార్డు లభించింది. డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ లయన్స్ క్లబ్‌తోపాటు వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారంతో చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించిన ఈ సంస్థ అంతర్జాతీయ డైరెక్టర్ ప్రిన్స్, అంబాసిడర్ డాక్టర్ ఇస్మాయిల్ ప్రాంకో అంతర్జాలం ద్వారా ఈ అంతర్జాతీయ స్థాయి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

గ్రామసభలు నిర్వహించాలి

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 24: స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళిక రూపకల్పనలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పన, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల నిర్వహణపై కలెక్టర్ జిల్లా, మండల స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి విజన్ డాక్యుమెంట్ అందించి, ప్రజలు రైతులు, విద్యార్థులు తదితర అన్ని వర్గాల నుంచి తమ స్మార్ట్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించి వారి అభిప్రాయాలను పొందుపరిచేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఇప్పటి వరకు జిల్లాలో 426 గ్రామసభలు నిర్వహించామని, ఇందులో 90వేల మంది ప్రజలు పాల్గొన్నారని అన్నారు.

జిల్లా పరిశ్రమల శాఖలో బదిలీలు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 24: జిల్లా పరిశ్రమల శాఖలో సాధారణ బదిలీల్లో భాగంగా జనరల్ మేనేజర్ ఎన్‌సీఆర్‌సీఎం ప్రసాద్ బదిలీ అయ్యారు. ఆయన నెల్లూరు జిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో నెల్లూరు జిల్లా పరిశ్రమలశాఖ జీఎం హరిప్రసాద్ కర్నూలుకు బదిలీపై రానున్నారు. ఇదే కార్యాలయంలో ఉప సంచాలకుడిగా పని చేస్తున్న రమణారెడ్డిని ప్రధాన కార్యాలయానికి బదిలీ చేయగా, ఆయన స్థానంలో డీడీగా అరుణ ఏలూరు నుంచి ఇక్కడికి రానున్నారు. ఏడీగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటరెడ్డిని చిత్తూరు జిల్లాకు, ఐపీవో శివప్రసాద్‌ను నంద్యాల జిల్లాకు బదిలీ చేశారు. నంద్యాల నుంచి దానియేలు కర్నూలుకు బదిలీపై రానున్నారు.

కాలుష్య నియంత్రణ మండలిలో..

కాలుష్య నియంత్రణ మండలి ఈఈ మునిప్రసాద్ అనంతపురం జిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో కిషోర్‌రెడ్డి కర్నూలు ఈఈగా బదిలీపై వస్తున్నారు. ఖాళీగా ఉన్న పర్యవేక్షక ఇంజనీరు స్థానానికి శంకర్‌నాయక్ బదిలీపై రానున్నారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.2.95 కోట్లు



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

మంత్రాలయం, సెప్టెంబరు 24: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.2,94,57,810 నగదు వచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి తెలిపారు. ఆగస్టు 5 రోజులతో పాటు సెప్టెంబరు 23 రోజులకు సంబంధించిన 28 రోజుల హుండీని మఠం గురురాజాంగణ భవనంలో మంగళవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శ్రీమఠంలోని 24 హుండీలను లెక్కించినట్లు తెలిపారు. నగదుతో పాటు 1.240 కేజీల వెండి, 70.500 గ్రాములు బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు చెప్పారు. ఈ హుండీ లెక్కింపులో సూపరింటెండెంట్లు అనంత పురాణిక్, రవి కులకర్ణి, ఆడిటర్ దత్తుస్వామి, కృష్ణమూర్తి, గిరిధర్, సుజ్ఞానేంద్ర, సంప్రీతి మోహన్, లక్ష్మీకాంత్, గురురాజ్ పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు గడువు పొడిగింపు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 24: మండలంలోని బనవాసి నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఈనెల 23వ తేదీ వరకు మొదటగా గడువు ఇచ్చిందని చెప్పారు. అయితే మళ్లీ ప్రభుత్వం అక్టోబరు 7వ తేదీ వరకు గడువు పొడగించిందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రేమ వివాహం



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో యువతికి తాళి కడుతున్న యువకుడు

ఆదోని రూరల్, సెప్టెంబరు 24: ఆలూరుకు చెందిన ప్రేమ జంట పోలీసులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారుల సాక్షిగా ఒక్కటైంది. ఆలూరుకు చెందిన సోడాల హోటల్ ఈరన్న, అంజినమ్మ దంపతుల కుమారుడు వాల్మీకి సోడాల ఉరుకుందు, దళిత సామాజిక వర్గానికి చెందిన బెళ్గిగుండు, అళ్లమ్మ దంపతుల కుమార్తె మునీంద్రమ్మ నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే కులాంతర వివాహం చేయడానికి యువకుడి తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. దీంతో పంచాయితీ ఆలూరు పోలీస్ స్టేషన్‌కు చేరింది. దీంతో ఎట్టకేలకు ప్రేమికుడు దిగి వచ్చి పెళ్లికి ఒప్పుకోవడంతో పోలీసులు, యువతి తరపున బంధువులు మంగళవారం ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి ప్రేమికులకు సబ్ రిజిస్ట్రార్ రాజశేఖర్ సమక్షంలో రిజిస్టర్ పెళ్లి చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు మాజీ ఎంపీటీసీ నరసప్ప, త్యాగయ్య, గోవిందు, రామాంజనేయులు, వీరేష్, జగన్, మారెప్ప, తదితరులు పాల్గొన్నారు.

స్వార్థ రాజకీయాల కోసమే

తిరుమల లడ్డూ వివాదం : వైసీపీ



గోనెగండ్లలో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

గోనెగండ్ల, సెప్టెంబరు 24: తిరుపతి లడ్డూల వివాదాన్ని సీఎం చంద్రబాబునాయుడు స్వార్థ రాజకీయాల కోసం వాడుకొని ప్రజలను తప్పుదోవ పట్టించారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం గోనెగండ్లలోని చింతలాముని నల్లారెడ్డి స్వామిని దశమి సందర్భంగా ఆయన దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటి కూడా ఇంత వరకు అమలు చేయలేదన్నారు. ప్రజలలో తనపై రోజురోజుకూ వ్యతిరేకత పెరుగుతుండంతో తిరుపతి లడ్డూ వివాదాన్ని తీసుకొచ్చారని అన్నారు. ఆయనతోపాటు కూడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, బుట్టా శివనీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

'అక్రమాలకు పాల్పడితే చర్యలు'



వేరుశనగకాయల తూకాన్ని పరిశీలిస్తున్న సెక్రటరీ జయలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 24: కర్నూలు మార్కెట్ యార్డులో తమకు గిట్టుబాటు ధర అందుతుందని రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు పక్క రాష్ట్రాల నుంచి కూడా రైతులు పంట ఉత్పత్తులను తీసుకువస్తున్నారని, అక్రమాలకు పాల్పడి వారిని నష్టపరిస్తే చర్యలు తీసుకుంటామని కర్నూలు మార్కెట్ కమిటి సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తులను తూకం వేసే సమయంలో సెక్రటరీ జయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు తెచ్చిన వేరుశనగ కాయలను ఎలక్ట్రానిక్ కాటాపై తూకం వేసే సమయంలో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు న్యాయం జరగాలని, లేకపోతే ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించేది లేదని అన్నారు. లైసెన్సులు రద్దు కూడా చేస్తామని హెచ్చరించారు. కమీషన్ ఏజెంట్లు కాటా వేసే సమయంలో తప్పనిసరిగా అదనపు సెక్రటరీలు సూపర్‌వైజర్లు నిఘా ఉంచాలని, అక్కడే ఉండి పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు సెక్రటరీలు వెంకటేశ్, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రసీదులు ఇవ్వాలి

రైతులు కర్నూలు మార్కెట్ యార్డుకు పంట ఉత్పత్తులు తీసుకువచ్చి కమీషన్ ఏజెంట్లకు విక్రయిస్తున్నారని, ఈ విషయంలో ఎటువంటి పొరపాట్లు లేకుండా రైతులకు కంప్యూటర్ రసీదులు అందజేయాలని మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి కంప్యూటర్ ఆపరేటర్లను ఆదేశించారు. మంగళవారం యార్డులో కంప్యూటర్ గదిలో ఆకస్మిక తనిఖీలు చేసిన సెక్రటరీ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మహానంది ఆలయ ఈవోగా నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి



మహానంది, సెప్టెంబరు 24: మహానంది ఆలయ ఈవోగా నల్లకాల్వ శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ మంగళవారం ఆదేశాలు జారీ చేసారు. గతంలో నరసరావుపేట కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయ రెగ్యులర్ ఈవోతో పాటు మహానంది దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి కొనసాగారు. అయితే ఇటీవల రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ఈవోల బదిలీల్లో భాగంగా దేవదాయశాఖ కమిషనర్ మహానంది దేవస్థానానికి రెగ్యులర్ ఈవోగా రాష్ట్ర దేవదాయశాఖ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న శోభారాణిని మహానంది ఈవోగా బదిలీ చేసారు. అయితే ఆ ఉత్తర్వులు ఒక్క రోజుల్లోనే రద్దు చేసి ఆమెను విశాఖ పట్టణంలోని కనక మహాలక్ష్మి దేవస్థానానికి బదిలీ చేస్తూ కమిషనర్ ఆదేశాలు జారీ చేసారు. తిరిగి గతంలో మహానంది ఆలయ ఇన్‌చార్జి ఈవోగా కొనసాగిన శ్రీనివాసరెడ్డిని పూర్తి స్థాయి బాధ్యతలతో తిరిగి మహానంది దేవస్థానానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. దీంతో పాటు గుంటూరు జిల్లా పొన్నూరు ఆంజనేయ స్వామి ఆలయానికి ఈవోగా నల్లకాల్వ శ్రీనివాసరెడ్డిని కమిషనర్ నియమించారు. మరో రెండు రోజుల్లో మహానంది ఆలయ ఈవోగా ఆయన బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

బీఈడీ 4వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 24: బీఈడీ 4వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 4 సెంటర్లలో నిర్వహించిన పరీక్షలకు 3231 మంది దరఖాస్తు చేసుకోగా 3091 మంది హాజరయి పరీక్షలు రాశారని తెలిపారు.

స్టైఫండ్ నిర్ణయంపై న్యాయవాదుల హర్షం



సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న న్యాయవాదులు

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 24: రాష్ట్రంలోని జూనియర్ న్యాయవాదులకు ప్రతి నెలా స్టైఫండ్ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల కర్నూలు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ క్షీరాభిషేకం చేశారు. ప్రతి జూనియర్ న్యాయవాదికి నెలకు రూ.10వేలు స్టైఫండ్ ఇవ్వడానికి సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతిలో జరిగిన న్యాయ సమీక్షలో నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లా టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు కేఈ జగదీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదుల సంక్షేమం పట్ల కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు తమ వృత్తిలో స్థిరపడేవరకు స్టయిఫండ్ ఇవ్వడం శుభపరిణామమని అన్నారు.

పొగాకు సెజేషన్ కేంద్రాల ప్రారంభం

కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 24: కేంద్ర ప్రభుత్వ కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా పొగాకు సెజేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కె.చిట్టినరసమ్మ తెలిపారు. ఈ మేరకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని సైక్రియాట్రి, స్టేట్ కేన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో రెండు పొగాకు సెజేషన్(మాన్పించు) కేంద్రాలను ప్రిన్సిపాల్ ప్రారంభించారు. పొగాకు బారిన పడిన వారికి ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో మానసిక వ్యాధుల విభాగం హెచ్‌వోడీ డా.ఎస్.నాగేశ్వరరావు, స్టేట్ కేన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.సీఎస్‌కే ప్రకాష్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం కాలజిస్టు డా.చంద్రశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ గంగాధర్ నాయక్, హేమంత్ పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల తనిఖీ



ఇసుక రీచ్‌ను తనిఖీ చేస్తున్న సాంకేతిక నిపుణులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 24: డీఆర్‌డీవో సాంకేతిక నిపుణులు జిల్లాలోని ఇసుక రీచ్‌ల్లో తనిఖీలు చేశారని గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. జిల్లాలోని ఇసుక తవ్వకాలు, రవాణా తదితర అంశాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి అవసరమైన సాంకేతిక కెమెరాల ఏర్పాటు ప్రక్రియకు అవసరమైన తనిఖీలు చేశారు. డీడీ మాట్లాడుతూ ఇసుక ప్రతి రోజు ఏ రీచ్‌లో ఎంత పరిమాణంలో తవ్వకాలు జరుగుతాయి? ఎంత అమ్మకాలు జరుగుతాయి? అని కొలిచే లేటెస్టు టెక్నాలజీతో కూడిన సాంకేతిక కెమెరాలు అమర్చేందుకు అవసరమైన ప్రక్రియలో భాగంగా సి.బెళగల్ మండలం సింగవరం స్టాక్ పాయింట్‌ను పరిశీలించామని చెప్పారు. దాదాపు ఇసుక రీచ్‌ల్లో వీటిని అమర్చి ఇసుక పాలసీలో లోపాలు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

బదిలీలలు

- జాబితాలో మళ్లీ సవరణ?
- రెవెన్యూ ఉద్యోగుల బదిలీల్లో అనుమానాలు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 24: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారిగా కొన్ని ఉద్యోగుల బదిలీలకు పచ్చజెండా ఊపింది. అందులో భాగంగా రెవెన్యూ శాఖలో జిల్లాలోని కొందరు 250 మంది వీఆర్వోలు, 10 మంది తహసీల్దార్లు, 30మంది ఆర్ఐలు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు సుమారుగా ఒక వంద మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా కలెక్టర్ కార్యాలయంలోని డీఆర్వో సిబ్బంది, రెవెన్యూ బదిలీలలో కొందరు అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బదిలీలకు దరఖాస్తు చేసుకున్న రెవెన్యూ ఉద్యోగులకు రెండు రోజుల క్రితం ఆర్డర్స్ ఇచ్చారు. కానీ కలెక్టర్ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ వీఆర్వో, ఆర్ఐ, తహసీల్దార్ల బదిలీలను డీఆర్వో కార్యాలయ సిబ్బంది మార్పులు, చేర్పులు చేస్తున్నట్లు సమాచారం. గతంలో వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో పని చేసిన ఒక ఉన్నతాధికారి, ఓర్వకల్లులో పని చేసిన ఒక ఆర్ఐ, మరొక అధికారి బదిలీల్లో మార్పులు చేర్పుల్లో కీలక సూత్రధారులుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. మార్పులు, చేర్పుల్లో భాగంగా కర్నూలు, కల్లూరు మండలాల్లో ఒక స్థానం కోసం రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ మార్పులు, చేర్పుల బదిలీలను డీఆర్వో సిబ్బంది ఇప్పటికే సిద్ధం చేసినట్లు సమాచారం.

కుర్చీ వదలని రెవెన్యూ సిబ్బంది

డీఆర్వో కార్యాలయంలో పని చేస్తున్న కొందరు సిబ్బంది 10 నుంచి 20 సంవత్సరాల నుంచి తిష్ట వేశారు. సాధారణ బదిలీల్లో బాగంగా వివిధ మండలాలకు అధికారులు బదిలీ అయినా డిప్యుటేషన్‌పై డీఆర్వో కార్యాలయంలో ప్రస్తుతం కొనసాగుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో డీఆర్వో కార్యాలయంలోని ప్రతి సెక్షన్‌లో ఒక్కో ఫైలుకు ఒక్కో రేటు నిర్ణయించారు. ఇప్పుడు జరుగుతున్న బదిలీల్లో వైసీపీతో అంటకాగిన ఉద్యోగులే మళ్లీ పెత్తనం చెలాయిస్తున్నారు. డీఆర్వో కార్యాలయంలోని కొందరు అధికారులు అప్పట్లో వైసీపీ ఏజెంట్లుగానూ పనిచేశారు. మళ్లీ ఇప్పుడు వారే బదిలీల్లో పైరవీలకు పాల్పడుతున్నట్లు సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో అలాంటి వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భారీ వర్షం.. తీవ్ర నష్టం

- గాలివాన ఉధృతికి కొట్టుకుపోయిన గడ్డివాములు
- కూలిపోయిన పరిశ్రమల రేకుల షెడ్లు
- వక్కేరు వాగుకు భారీగా వరద

కర్నూలు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా సోమవారం రాత్రి కురిసిన వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. కర్నూలు రూరల్ మండలం పరిధిలో పలు గ్రామాల్లో తీవ్ర నష్టం పరిగింది. గొందిపర్ల, ఈ.తాండ్రపాడు గ్రామాల్లో భారీ వర్షాలకు అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. పాడిగేదెల కోసం ఏర్పాటు చేసుకున్న షెడ్లు, గడ్డివాములు గాలివాన ఉధృతికి కొట్టుకుపోయాయి. పశుగ్రాసం లేక మూగజీవాలను పస్తులు పెట్టాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. ఆ ప్రాంతంలో ఉన్న వివిధ పరిశ్రమల (ఫ్యాక్టరీలు)కు చెందిన రేకుల షెడ్లు గాలివాన బీభత్సానికి కుప్పకూలిపోయాయి. కల్లూరు మండలం పెద్దపాడు, ఎ.గోకులపాడు, నెరవాడ, సల్కాపురం, పర్ల, గూడూరు మండలం కె.నాగులాపురం తదితర గ్రామాల్లో భారీ వర్షాలు పడ్డాయి. నల్లరేగడి నేల పొలాలు తడిసిముద్దవడంతో పనుల కోసం రైతులు పొలాల్లోకి వెళ్లలేని దుస్థితి నెలకొంది. లోతట్టు పొలాల్లో పంటలు నీటిమునిగాయి. వక్కేరు వాగుకు వరద రావడంతో పలు గ్రామాలకు రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో మంగళవారం సగటున 17.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యధికంగా నందవరం మండలంలో 96 మిల్లీ మీటర్లు, కల్లూరు మండలంలో 53.8, మంత్రాలయం మండలంలో 47.4, ఎమ్మిగనూరు మండలంలో 44.2, కర్నూలు రూరల్ మండలంలో 36.2, కర్నూలు అర్బన్ మండలంలో 35.4, గోనెగండ్ల మండలంలో 34.4, గూడూరు మండలంలో 22.6, వెల్దుర్తి మండలంలో 17.2, కోడుమూరు మండలంలో 14.8, కోసిగి మండలంలో 14.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు చేసుకుంది. సెప్టెంబరు నెలలో సాధారణ వర్షపాతం 93.2 మిల్లీ మీటర్లు కాగా.. ఇప్పటి వరకు 82.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్

చాగలమర్రి, సెప్టెంబరు 24: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ ఆదేశించారు. మంగళవారం చాగలమర్రి పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని నేరాల గురించి ఎస్ఐ రమేష్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి ఉంచామని అన్నారు. రౌడీషీటర్లు, గంజాయి, మద్యం, సారా, మట్కా, జూదం వంటి వాటిపై నిఘా ఉంచామని సూచించారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), సెప్టెంబరు 24 : ఆళ్లగడ్డ పట్టణంలోని పాలసాగరం రోడ్డులోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటినట్లు హెచ్ఎం మురళీధర్ మంగళవారం తెలిపారు. ఈ నెల 21న కర్నూలులోని డీఎస్ఏ స్టేడియంలో జరిగిన అండర్-17 బాలుర సెపక్‌తక్రా విభాగంలో పదో తరగతి విద్యార్థి వేమ నారాయణరెడ్డి, 23న నంద్యాలలోని కేఎన్ఎం మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగిన జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే యుగంధర్, ధర్మ దస్తగిరి, వెంకటసంతోష్ కుమార్‌రెడ్డి, వేమ నారాయణరెడ్డి వివిధ పోటీల్లో రాణించినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను హెచ్ఎం మురళీధర్, వ్యాయామ ఉపాధ్యాయుడు బాబు అభినందించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి: పీడీ

శిరివెళ్ల, సెప్టెంబరు 24: ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా లబ్ధి దారులను ప్రోత్సహించాలని హౌసింగ్ పీడీ వెంకట సుబ్బయ్య సూచించారు. మంగళవారం ఆళ్లగడ్డ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షా నిర్వహించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న గృహాలు మార్చి, 2025 నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మన ఇళ్లు-మన గౌరవం పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో మహబూబ్ ఖాన్, తహసీల్దార్ రత్నకుమారి, హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖల ఏఈలు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల సంబరాలు


డోన్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

బేతంచెర్ల, సెప్టెంబరు 24: ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి నియామకం కావడంపై బేతంచెర్ల టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి ఆధ్వర్యంలో పాతబస్టాండులో మంగళవారం బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉన్నం చంద్రశేఖర్, విజయుడు, నారాయణ స్వామి, సమక్షంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సుబ్బారెడ్డికి సముచిత స్థానం కల్పించారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, నాగేశ్వరరెడ్డి, జీవన్ చౌదరి, వార్డు కౌన్సిలర్లు రామ్మూర్తి, నంద్యాల మధు, రామకృష్ణ, కిరణ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

డోన్‌పట్టణంలో ...

డోన్: రాష్ట్ర సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ధర్మవరం సుబ్బారెడ్డిని నియమించడంతో మంగళవారం డోన్ పట్టణంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు అంబరాన్నంటాయి. పట్టణ పార్టీ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, టీడీపీ యువ నాయకులు ధర్మవరం చిన్ననాగిరెడ్డి, గౌతమ్ రెడ్డి, భరత్ రెడ్డి ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. సుబ్బారెడ్డి నివాసం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు మోటారు బైక్ ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండులో ప్రజలకు స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, యాపదిన్నె సర్పంచ్ రామిరెడ్డి, ఆలా మల్లికార్జున రెడ్డి, న్యాయవాది మధుసూదన్‌గౌడు, చక్రపాణిగౌడు, చిన్నకాంతు, ఉడుములపాడు ప్రవీణ్ రెడ్డి, నీలం ప్రభాకర్, ఎర్రిస్వామి గౌడు, కేబుల్ కిరణ్ పాల్గొన్నారు.

'క్రీడల్లోనూ రాణించాలి'

డోన్(రూరల్), సెప్టెంబరు 24: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, టీడీపీ నాయకులు మర్రి రమణ, ఓబులాపురం శేషిరెడ్డి, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి అన్నారు. మంగళవారం డోన్ సమీపంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం ప్రాంగణంలో డోన్ నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన వారు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుధాకర్, పంచాయతీరాజ్ ఈఈ గంగాధర్, డోన్ పాతపేట జడ్పీహెచ్‌ఎస్ హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి, నాయకులు ఓంప్రకాష్ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

సంజామల, సెప్టెంబరు 24: సంజామల గ్రామానికి చెందిన మూర బోయిన శివనాగేంద్ర ప్రసాద్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన న్యాయవాది అలీ హుసేన్ తన అనుచరులు దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణయ్య మంగళవారం తెలిపారు.

ట్రాక్టర్, బైకు ఢీ.. యువకుడి మృతి

బేతంచెర్ల, సెప్టెంబరు 24: ఎదురెదురుగా వచ్చిన ట్రాక్టర్, బైక్ ఢీకొని యువకుడు మృతి చెందాడు. మరో యువకుడికి గాయాలయ్యాయి. మండలంలోని హెచ్. కొట్టాల గ్రామం ముచ్చట్ల మల్లికార్జున స్వామి దేవాలయం సమీపంలో మంగళవారం చోటు చేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన రాజు, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు శ్రీనివాసులు(23), తన మిత్రుడు గణేష్‌తో కలిసి బైక్‌పై ముచ్చట్ల ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుంగా.. ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు యువకులను బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శ్రీనివాసులు మృతి చెందాడు. గణేష్‌ను ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బేతంచెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దంచికొట్టిన వాన

- పొంగి పొర్లిన వాగులు, వంకలు
- నీట మునిగిన పంటలు

డోన్(రూరల్), సెప్టెంబరు 24: మండలంలో మంగళవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లాయి. భారీ వర్షం కారణంగా డోన్, గడివేముల గ్రామాల మధ్య రోడ్డుపై పెద్ద ఎత్తున నీరు పారడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. అలాగే డోన్ పట్టణం సమీపంలోని వంకలు, వాగులు వర్షం నీటితో నిండి భారీగా వర్షం నీరు ప్రవహించింది. డోన్ పట్టణంలో 4 సెం.మీ వర్షం నమోదైనట్లు మండల వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీ తెలిపారు.


చాగలమర్రిలో మొక్కజొన్న ధాన్యంపై కప్పిన టార్పాలిన్ కవర్‌పై నిలిచిన వర్షపు నీరు


డోన్ మాలిక్‌బాబా గుడి ప్రాంతంలో పారుతున్న వర్షం నీరు

ఇబ్బందులు పడిన ప్రయాణికులు

భారీ వర్షం కారణంగా డోన్ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం మీద ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వర్షం ఒలిపిరి తాకిడికి వణికిపోయారు. వర్షం కారణంగా తెల్లవారుజామున ప్రయాణం చేసే ప్రయాణికులు కూడా ఇబ్బందులు పడినట్లు టీడీపీ డోన్ పట్టణ నాయకుడు హనుమంత్‌రెడ్డి తెలిపారు.

మూడు గ్రామాల్లో భారీ వర్షం ..

కొలిమిగుండ్ల: మండలంలో 33గ్రామాలు ఉండగా మూడు గ్రామాల్లో భారీ వర్షం కురవడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. మండలంలోని మీర్జాపురం, బెలుం, బెలుంశింగవరం గ్రామాల్లో గడచిన 24గంటల్లో భారీ వర్షం నమోదైంది. దీంతో మీర్జాపురం రహదారిలోని రైతులు సాగు చేసిన పంట పొలాలు నీటిలో మునిగి పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొలిమిగుండ్లకు చెందిన పేరం ఈశ్వరరెడ్డి అనే రైతు ఐదుఎకరాల్లో మినుము సాగుచేసి, కోత కోసి ఉన్న సమయంలో వర్షం రావడంతో పంట మొత్తం మునిగి, రూ.1.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. సమీపంలోని పొగాకు, కంది, ఆముదం పంటలు 20ఎకరాల్లో నీట మునిగినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు చాలా రోజుల తర్వాత మూడు గ్రామాల్లో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలకు వర్షం ఎంతగానో ఉపయోగపడు తుందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కొలిమిగుండ్ల: నీటిలో మునిగిన నూర్పిడి పంటను చూపుతున్న రైతు

తడిసిన మొక్కజొన్న ధాన్యం

చాగలమర్రి: చాగలమర్రి మండలంలో మంగళవారం తెల్లవారుజామున వర్షం కురిసింది. 11.4 మి.మీ వర్షపాతం నమోదైంది. శెట్టివీడు, గొడిగనూరు, ముత్యాలపాడు, పెద్దబోదనం, చాగలమర్రి తదితర గ్రామాల్లో చేతికొచ్చిన మొక్కజొన్న ధాన్యాన్ని సర్వీసు రహదారులపై అరబెట్టుకున్నారు. అకాల వర్షంతో మొక్కజొన్న తడిసి నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు నిర్ణయించిన ధరకే విక్రయించాల్సి వస్తుందని వాపోయారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలంటూ రైతులు కోరారు.


కొలిమిగుండ్ల: నీటిలో మునిగిన పంటలు

సంక్షోభంలోనూ సంక్షేమం: ఎమ్మెల్యే

దొర్నిపాడు, సెప్టెంబరు 24: సంక్షోభంలోనూ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం మండలంలోని దొర్నిపాడు గ్రామంలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం దొర్నిపాడు సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజుల్లో రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. సంక్షేమం అంటే విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని అన్నారు. గత పాలకులు రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు భ్రష్టు పట్టించి అప్పుల ఊబిలో నెట్టారని అన్నారు. సూపర్-6లో భాగంగా దీపావళి నుంచి గ్యాస్ సిలిండర్ అందించనున్నట్లు తెలిపారు. అక్టోబరు నుంచి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. సచివాలయంలో మొక్కలను నాటారు. అనంతరం ఇంటింటికి వెళ్లి వంద రోజుల పాలనపై ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ సుభద్ర, నాయకులు భూమా సందీప్ రెడ్డి, భూమా సంతోష్‌రెడ్డి, సిద్ధి సత్యం, గంగవరం కృష్ణారెడ్డి, బొబ్బూరి వెంకటస్వామి, బొబ్బూరి కృష్ణ, కొత్తపల్లి సురేంద్ర, తాళ్లూరి రమేష్ నాయుడు, సుధాకర్, నాయుడు, రమణయ్య, అంకన్నయాదవ్, నిమ్మకాయల వెంకట్రామిరెడ్డి, కాశీ విశ్వనాథ్‌రెడ్డి, ఎండూరి గోపాల్‌నాయుడు, పుల్లయ్య, పగడాల రమేష్‌బాబు, హబీబ్‌బాష తదితరులున్నారు.

జడ్పీహెచ్ పాఠశాల తనిఖీ

దొర్నిపాడు మండలంలోని భాగ్యనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలోని క్లాస్ గదులకు వెళ్లి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో తాళ్లూరి రమేష్ నాయుడు, కొత్తపల్లి సురేంద్ర తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

చివరి ఆయకట్టు వరకు సాగునీరు

ఉయ్యాలవాడ: రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తున్నామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉయ్యాలవాడలో పర్యటించారు. ముందుగా శారిటేషన్‌కు మంజూరు అయిన ట్రాక్టర్‌ను ఆమె ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి వంద రోజుల ప్రభుత్వ కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామంలోని పదిమంది గర్భిణులకు సీమంత చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితును అధిగమించి అన్ని ప్రాజెక్టుల్లో, చెరువుల్లో నీళ్ల నింపామన్నారు. అలాగే గ్రామాల అభివృద్ధికి రూ. 2.50 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బోరెడ్డి శేఖర్‌రెడ్డి, మండల నాయకులు కూడాల నారాయణరెడ్డి, మారంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బోరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, నర్శిరెడ్డి, పేరెడ్డి మోహన్‌రెడ్డి, పల్లె బాబుల్‌రెడ్డి, కొర్రపాటి నారాయణ రెడ్డి, ఆకుల వెంకటసుబ్బయ్య, జనసేనా మండల అధ్యక్షుడు డీకే బాబు, కర్నాటి మహేశ్వరరెడ్డి, చిట్టెపు రాజగోపాల్‌రెడ్డి, మద్దూరు క్రిష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, భాష, గోతుల శేఖర్, కుప్పరమీది వెంకటేశ్వర్లు, నరేంద్రారెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అవుకు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా రాముడు

అవుకు, సెప్టెంబరు 24 : అవుకు ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా రాముడు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన డోన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ బదిలీపై అవుకు వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసిన వసంత బదిలీపై కర్నూలు అడిట్ డీఆర్ కార్యాలయానికి వెళ్లారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈగా మధుసూదన్

బనగానపల్లె, సెప్టెంబరు 24: బనగానపల్లె ఆర్‌డబ్ల్యూఎస్ డీఈగా మధు సూదన్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల నుంచి బది లీపై వచ్చారు. బనగానపల్లెలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈగా పనిచేస్తున్న ఉమాకాంత్‌రెడ్డి ఆత్మకూరు డీఈగా బదిలీ అయ్యారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), సెప్టెంబరు 24: సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని ఆళ్లగడ్డ పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం వీర రాఘవయ్య అన్నారు. క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా 1983-84 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఎంఎస్ చక్రవర్తి, రవికుమార్, ఊకా సురేష్ రూ.10 వేలు విలువ చేసే క్రికెట్ క్రీడా పరికరాలను మంగళవారం అందజేసినట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో భాగంగా గతంలో రూ.20 వేలు విలువ చేసే నీళ్ల ట్యాంకును పూర్వ విద్యార్థులు అందజేశారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), సెప్టెంబరు 24: టీడీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ఆ పార్టీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ మండలంలోని ఓబులంపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త, భూమా కుటుంబ అభిమాని అబ్దుల్ నబి గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన మృతదేహానికి విఖ్యాత్‌రెడ్డి పూలమాల వేసి మంగళవారం నివాళి అర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

కుంట ఆక్రమణపై విచారణ

కోవెలకుంట్ల, సెప్టెంబరు 24 : కోవెలకుంట్ల మండల పరిధిలోని కంపమల్ల గ్రామంలో గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు వ్యక్తులు అక్రమంగా 307, 308 సర్వేనెంబర్లలో ఇళ్లను నిర్మించుకున్నారని గ్రామానికి చెందిన కొంతమంది కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. కలెక్టరు ఫిర్యాదు మేరకు మంగళవారం అధికారులు కంపమల్ల గ్రామంలో విచారణ చేపట్టారు. తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో సయ్యదున్నీసా ఈవోపీఆర్‌డీ రాధికారెడ్డి, డీఈ భాస్కర్‌రావు, ఏఈ రామ్మోహన్, ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి పంచాయతీ సెక్రటరీ వీఆర్వో కలిసి కంపమల్లకు చేరుకుని విచారించారు. నివేదికలు తయారు చేసి ఆర్డీవో, కలెక్టరుకు పంపనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

బనగానపల్లె ఎంపీడీవోగా రమణ

బనగానపల్లె, సెప్టెంబరు 24: బనగానపల్లె ఎంపీడీవోగా రమణను నియమిస్తూ జిల్లా అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం బనగాపల్లె ఎంపీడీవోగా ఇన్‌చార్జి బాధ్యతలను నాగరాజు నిర్వహిస్తున్నారు. త్వరలో అయన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

ముగిసిన భాగవత సప్తాహం

శిరివెళ్ల, సెప్టెంబరు 24 : పట్టణంలోని అమృత లింగేశ్వర స్వామి దేవస్థానంలో భాగవత సప్తాహం ముగిసినట్లు ప్రముఖ అష్టావధాని కవిరాజు గంగుల నాగరాజు తెలిపారు. విశ్రాంత తెలుగు ఆచార్యులు సరస కవి డాక్టర్ వైష్ణవ వెంకట రమణమూర్తి భాగవతం ఆవశ్యకతను బోధించారన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్యాపిలి, సెప్టెంబరు 24: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని సెర్ప్ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీడీ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. దీంతో అనేక మంది రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని సాగిస్తున్నారన్నారు. పంట పెట్టుబడులు కూడా తగ్గుతాయన్నారు. సమావేశంలో డీఎల్‌ఎంపీ లక్ష్మయ్య, ఏపీఎం క్రిష్ణమూర్తి, సీసీలు , వీవోఏలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలి

రుద్రవరం, సెప్టెంబరు 24 : ప్లాస్టిక్ వస్తువులకు దూరం ఉండాలని సెక్షన్ ఆఫీసరు శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం రుద్రవరం రేంజ్‌లోని పాల్కన్ బేస్‌క్యాంపు సమీపంలో ప్లాస్టిక్ కవర్లను సేకరించారు. ఈ సందర్భంగా సెక్షన్ ఆఫీసరు మాట్లాడుతూ పాల్కన్ బేస్‌క్యాంపు నుంచి దుర్గమ్మ గుడి, అహోబిళం నుంచి ఆళ్లగడ్డ వెళ్లే రహదారిలో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లను తొలగించారు. ప్రతి ఒక్క రూ మొక్కలునాటి పచ్చదనాన్ని పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అడవులు మానవుని మనుగడకు ఎంతో ఉపయోగపడతాయని వారన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు రామక్రిష్ణ, నాగేంద్రయ్య సురేంద్రగౌడ్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి


పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో

బనగానపల్లె, సెప్టెంబరు 24: విద్యార్థులు గెలుపోట ములను సమానంగా స్వీకరించాలని మండల విద్యాధికారి స్వరూప అన్నారు. మంగళవారం మండలంలోని పలుకూరు గ్రామంలోని జడ్పీ ఉన్నతపాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను ఎంఈవో ప్రారంభించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి 2, శ్రీనివాసులు ఉన్నతపాఠశాల హెచ్ఎం గౌరీశంకర్, కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, సురేంద్ర, ఎఎంసీ చైర్మన్ మధు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలకేంద్రమైన కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మండలస్థాయి స్కూల్ గేమ్ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఎంఈవో అబ్దుల్‌కలాం ఈపోటీలను ప్రారంభించగా, మండలంలోని వివిధ గ్రామాల ఉన్నతపాఠశాల విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం హుశేనయ్య, వైవిఎస్ నారాయణరెడ్డి, పీడీలు కంబగిరి, గంగాదేవి, పిఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఉపాధి' వివరాలు పంపించండి

రుద్రవరం, సెప్టెంబరు 24 : కొండను తవ్వారు గానీ.. అనే శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం కథనం ప్రచురితమైంది. దాంతో ఉపాధి హామీ పథకం ఉన్నతాధికారులు స్పందించారు. పీడీ కార్యాలయం నుంచి ఉపాధి పనులపై నివేదికలు పంపాలని ఉత్తర్వు లు జారీ చేసినట్లు సమాచారం. స్థానిక రుద్రవరం ఉపాధి కార్యాలయం నుంచి పీడీ కార్యాలయానికి నివేదికలు పంపారు. ఆ నివేదికల్లో సరైన సమాధానం లేవని రిజక్ట్ చేసి పంపినట్లు సమాచారం.

పోలీసు స్టేషన్ ఆవరణలో శ్రమదానం

చాగలమర్రి, సెప్టెంబరు 24: చాగలమర్రి గ్రామంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో మంగళవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో మహబూబ్‌దౌల ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది కలిసి పిచ్చి మొక్కలను తొలగించారు. ఓవర్‌హెడ్ ట్యాంకును శుభ్రపరిచి క్లోరినేషన్ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్‌రెడ్డి, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, మండల కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

శిరివెళ్ల, సెప్టెంబరు 24: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ చిన్న పీరయ్య మంగళవారం తెలిపారు. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం అయ్యవారిపల్లె గ్రామానికి చెందిన నంద్యాల మల్లికార్జున అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా ద్వారా ఇసుకను తరలిస్తుండగా శిరివెళ్ల మెట్ట సమీపంలో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొలిమిగుండ్ల ఎంపీడీవోగా వెంగన్న

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 24: కొలిమిగుండ్ల మండల ఎంపీడీవోగా వెంగన్నను నియమిస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బేతంచర్ల మండల ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న వెంగన్న కొలిమిగుండ్లకు బదిలీపై వచ్చారు. కొలిమిగుండ్ల ఈవోఆర్డీ శ్రీహరిని తుగ్గలి మండలానికి బదిలీ చేశారు.

రేకుల షెడ్డును తొలగించాలి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 24: కోవెలకుంట్ల మండల పరిధిలోని వెలగటూరు గ్రామంలోని బీసీ కాలనీలో సర్పంచ్ ఎల్వి సుధాకర్‌రెడ్డి అనుచరుడు మద్దిలేటి రస్తాకు అడ్డంగా గోడ నిర్మించి రేకులషెడ్డు నిర్మిస్తున్నాడని టీడీపీ నాయకుడు ధనుంజయుడు ఫిర్యాదు చేశారు. మంగళవారం తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. తహసీల్దార్ స్పందిస్తూ వీఆర్వో, సర్వేయరుతో విచారిస్తామన్నారు. రస్తాలో అడ్డంగా గోడ నిర్మించుకున్నట్లు రుజువైతే చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు ధనుంజయుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అవుకు, సెప్టెంబరు 24 : అవుకు మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన చాకలి రాముడు అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. మంగళవారం రాత్రి 9-15 గంటల ప్రాంతంలో బనగానపల్లె నుంచి ఓబుళాపురం గ్రామానికి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా కోనాపురం మెట్ట సమీపంలోని బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి అదుపుతప్పి కింద పడి గాయాల పాలయ్యాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ రాజారెడ్డి ఘటనా స్థలాని చేరుకొని గాయపడ్డ రాముడిని చికిత్స నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


చంద్రబాబుతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ సాధ్యం

రుద్రవరం, సెప్టెంబరు 24 : ఏపీ సీఎం చంద్రబాబుతోనే 2047 స్వర్ణాంధ్రప్రదేశ్ సాధ్యమని ఉపసర్పంచ్ బండారు బాలరాజు, నాగభూషణ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆర్.కొత్తూరు, మందలూరు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు రవీంద్రనాయక్, ఓబులేసు, వెల్ఫేర్‌అసిస్టెంట్లు సురేఖ పాల్గొన్నారు.

చాగలమర్రి: టీడీపీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని టీడీపీ గ్రామ కన్వీనర్ శేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని గొడిగనూరు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు రామకృష్ణ, నరసింహుడు, రామసుబ్బారెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శిరివెళ్ల : రాష్ట్రంలోని పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని మోత్కలపల్లె గ్రామ సర్పంచ్ భూమా వెంకట వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మోత్కలపల్లెలో మంగళవారం ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి రాఘవేంద్ర, నాయకులు పాలూరి శివరామిరెడ్డి పాల్గొన్నారు.

బనగానపల్లె: రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోను సంక్షేమ కార్యక్రమాలను ఎన్‌డీఏ ప్రభుత్వం అందిస్తోందని టీడీపీ నాయకులు అన్నారు. మంగళవారం బనగానపల్లె మండలంలోని చెర్వుపల్లె గ్రామంలో శరత్, మాజీ సర్పంచ్ మద్దిలేటి, వెంకటసుబ్బయ్య, ఎంపీడీవో నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, ఈవో హరిప్రసాద్, రాళ్లకొత్తూరు గ్రామం లో టీడీపీ నాయకులు జంగిటి రామయ్య, రామపుల్లయ్య, బనగానపల్లె పట్టణంలో 105 వబూత్‌లో టీడీపీ నాయకులు కరాటే భాష, డ్రైవర్ వలి, మహబూబ్‌భాష, హాజీ వలి, పిడాహుస్సేన్, అహ్మద్‌హుస్సేన్, ఇతర అధికారుల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఎన్‌డీఏ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, ఇది మంచి ప్రభుత్వం పోస్టర్‌ను ఇంటింటికి అతికించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.


ప్యాపిలిలో పోస్టర్లతో అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

ప్యాపిలి: పేదల సంక్షేమమే సీఎం చంద్రబాబు ధ్యేయమని టీడీపీ నాయకులు టి. శ్రీనివాసులు, రామ్మోహన్‌యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర, గండికోట రామాంజినేయులు, నరేంద్ర యాదవ్, ప్రతాప్‌రెడ్డి, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనం కోసమే 'పొలం పిలుస్తోంది'

చాగలమర్రి, సెప్టెంబరు 24: రైతుల ప్రయోజనం కోసమే ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఏవో రంగనేతాజీ తెలిపారు. మంగళవారం మండలంలోని శెట్టివీడు గ్రామంలో సర్పంచ్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం లాభదాయకం అన్నారు. సేంద్రియ మందుల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, పశువైద్యాధికారి సాయిబాబా, ఏఈవో మంజుల, వీహెచ్ఏలు ఉమామహేశ్వరి, ఫరూక్, షాహిద, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రుద్రవరం : రైతునేస్తం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఏవో శ్రీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని కోటకొండ, యల్లావత్తుల గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమోహన్, టీడీపీ నాయకులు వెంకటపతి, సత్యంరాజు, ఏఈవో రాజు, రైతు సేవా కేంద్రం సిబ్బంది రేష్మా, రేవతి, వెటర్నరీ అసిస్టెంట్లు బానునాయక్ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : మండలంలోని కమ్మవారిపల్లె గ్రామంలో మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఏఈవో నాగరాజు మనోహర్, టీడీపీ నాయకులు కత్తి రాందాస్, రైతులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: రైతులు రసాయన ఎరువులు వాడటం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో వ్యవసాయాధికారి సునీత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కౌలు రైతులకు కౌలు కార్డులు, భూసార కార్డులను పంపిణీ చేశారు.

బేతంచెర్ల: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం, అంబాపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో డోన్ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్, ఏఈవోలు మధు, బెన్నిరాజు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని అంబాపురం గ్రామంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన ప్రాంతం, నంద్యాల శాస్త్రవేత్త వెంకటరమణ పాల్గొన్నారు.